ఆడుతూ.. పాడుతూ..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్ల బోధన
- రేపటి తరానికి మంచి పునాది



కోరుకొండ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆట పాటలతో బోధన

మధురపూడి: బాల్యం ఎంతో అమూల్యం.. అలాంటి పసిప్రాయంలో వేసే అడుగులే భవితకు పునాది లాంటిది.. అందుకే చిన్నారుల సంరక్షణ, విద్యపై ఆసక్తి కలిగించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. ఇక్కడ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లగా మార్పు చేసింది. వీటిని చిన్నారులకు ఆంగ్ల బోధన అందించేందుకు అనువుగా తీర్చిదిద్దింది. అందుకు అనుగుణంగా అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. దీనికి గాను స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రత్యేక సిలబస్ రూపొందించింది. చిన్నారుల విద్యకు అవసరమైన కిట్లను ప్రభుత్వం సమకూర్చింది. ఈ నూతన విధానంలో వివిధ రకాల బొమ్మలు, ఆట, పాటలతో బోధన సాగిస్తోంది. అలాగే ఆసక్తికరమైన బోధనా పుస్తకాలతో చిన్నారులకు అర్థమయ్యేలా విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. ఇక్కడ ఆంగ్లం నేర్చుకోవడం, పలకడం, అంకెల గురించి చెప్పడం చేస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ వర్క్‌బుక్‌లో ఏ అక్షరం నుంచి జెడ్ అక్షరం వరకూ పరిచయం ఉంటుంది. గణితం వర్క్‌బుక్‌లో 1 నుంచి 10 అంకెలు పరిచయం, యాక్టివిటీ బుక్‌లో బొమ్మలు గీయడం, రంగులు వేయడం తదితర అంశాలు ఉంటాయి.

ప్రాజెక్టు పరిధిలో ఎంతమంది అంటే..

కోరుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలు ఉన్నాయి. ఇక్కడ 228 అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ ప్రైమరీ స్కూళ్లలో 2,738 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. కోరుకొండ మండలంలోని 85 కేంద్రాల్లో 853 మంది చిన్నారులున్నారు. సీతానగరం మండలంలోని 69 కేంద్రాల్లో 742 మంది, గోకవరం 74 కేంద్రాల్లో 1,035 మంది చిన్నారులు ఉన్నారు. ఇక్కడ అంగన్‌వాడీ కార్యకర్తలు 225 మంది ఉండగా, ముగ్గురు మినీ కార్యకర్తలున్నారు. వారికి సహాయకులుగా 225 మంది పని చేస్తున్నారు. వీటన్నింటిని ప్రీ ప్రైమరీ స్కూళ్లగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంతో చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. ప్రీప్రైమరీ స్కూళ్లలో రెండు తరగతులుగా బోధనలుంటాయి. ప్రీప్రైమరీ-1లో మూడేళ్లు నిండిన చిన్నారులకు, ప్రీ ప్రైమరీ-2లో నాలుగేళ్లు నిండిన పిల్లలకు విద్యా బోధన చేస్తున్నారు.

సృజనాత్మకత పెరుగుతోంది



ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా అప్‌డేట్ అయిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సృజనాత్మకత పెంచే బోధన అందిస్తున్నారు. ఇంగ్లిషు, లెక్కల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా బోధన సాగిస్తున్నారు. ఇది రేపటి భవిష్యత్తుకు పునాది లాంటిది.

–జి.ఝాన్సీరాణి, సీడీపీఓ, కోరుకొండ

ప్రైవేట్‌కు దీటుగా బోధన



ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ స్కూళ్లలో ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా బోధన అందుతుంది. చిన్నతనం నుంచే చిన్నారుల్లో చదువుపై ఆసక్తి కలిగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తద్వారా వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చు.

–తాతపూడి వీర్రాఘవమ్మ, చిన్నారి తల్లి, జంభూపట్నం

క్లుప్తంగా

ఘనంగా సంతోషిమాత జన్మదిన వేడుకలు



శాకంబరీదేవిగా సంతోషిమాత

అనపర్తి: స్థానిక సంతోషిమాత ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి శుభ నక్షత్రాన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జి.ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారిని పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం శాకంబరిగా అలంకరించారు. భక్తులచే అమ్మవారికి సహస్ర పుష్పార్చన, సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నూతనంగా 220 పింఛన్ల మంజూరు

బిక్కవోలు: మండలంలో నూతనంగా 220 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ జేపీ ఝాన్సీ గురువారం తెలిపారు. బిక్కవోలులో 38, బలభద్రపురం 39, కొమరిపాలెం 28, కొంకుదురు 30, పందలపాక 26, రంగాపురం 19, తొస్సిపూడి 13, ఊలపల్లి 7, కాపవరం 4, ఇలపల్లి 6, ఆరికరేవుల 6, మెళ్లూరు 4 మంజూరయ్యాయని చెప్పారు.

ఎంపీడీఓ విజయభాస్కర్‌కు డీఎల్‌డీఓగా పదోన్నతి



డీఎల్‌డీఓగా పదోన్నతి పొందిన విజయభాస్కర్

పెదపూడి: పెదపూడి ఎంపీడీఓ పోకల విజయభాస్కర్‌కు డీఎల్‌డీఓగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని విజయభాస్కర్ గురువారం తెలిపారు. ఆయనకు ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, తహసీల్దార్ టి.సుభాష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, చింతా దొరబాబు, ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసు చౌదరి తదితరులు అభినందనలు తెలిపారు.

పారిశుధ్యం మరింత మెరుగుపరచాలి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపరచాలని ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసుచౌదరి అన్నారు. మండలంలో పెదపూడి, దోమాడ, కై కవోలు గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు రోజూ పారిశుధ్య పనులను పరిశీలించాలన్నారు. మురుగు కాలువల్లో పూడిక, రోడ్డు పక్కన చెత్త కుప్పలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, అచ్చిరాజు, ఎం.త్రినాథ్, బి.ప్రసన్నకుమార్, ఎస్‌వీ స్వామి, చిన్ని, గౌతమి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



గాడాలలో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళలు

మధురపూడి: కోరుకొండ మండలంలోని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు మొదలయ్యాయి. గాడాల తదితర పెద్ద పంచాయతీలకు జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోదావరి నీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు. రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదేశాల మేరకు ఈ సేవలు అందిస్తున్నారు. రోజూ ఉదయం 11 గంటలకు, సాయంత్రం 7 గంటలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. పబ్లిక్ కుళాయిల ద్వారా పుష్కలంగా నీరందని వారు ఈ సేవలను వినియోగించుకుంటున్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

రంగంపేట: మండల పరిధిలోని పెదరాయవరం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కె.మాధవీలత పర్యటిస్తారని మండల పంచాయతీరాజ్ జేఈ కమ్మసత్తి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పెదరాయవరంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాలను రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలతో కలిసి ఆమె ప్రారంభిస్తారని చెప్పారు.

'గిడుగు' పురస్కారం ప్రదానం



డాక్టర్ తరపట్లను అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ తరపట్ల సత్యనారాయణకు తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు పురస్కారం లభించింది. యూనివర్సిటీలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడంతో పాటు తెలుగు భాష, సంస్కృతీ సాహిత్యాల అభివృద్ధికి కృషి చేసిన ఆయన తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ విజయవాడలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. దీనికి సంబంధించిన జ్ఞాపికను డాక్టర్ తరపట్లకు అందజేస్తూ 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు అభినందనలు తెలిపారు. డాక్టర్ ఎస్.కిరణ్‌చంద్ర, డాక్టర్ ఎస్.రాజశేఖర్, డాక్టర్ ఆర్.జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ పుస్తకావిష్కరణ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.వెంకట్రావు, మరికొంతమంది అధ్యాపకులతో కలసి రచించిన బీఎస్సీ పాఠ్య పుస్తకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆవిష్కరించారు. ఫస్ట్ సెమిస్టర్‌కు సంబంధించిన 'ఎస్సెన్షియల్స్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ మేథమేటికల్, ఫిజిక్స్ అండ్ కెమికల్ సైన్సెస్' పాఠ్య పుస్తకంగా ఇది ఉపయోగపడుతుంది. డాక్టర్ వెంకట్రావుతో పాటు ఆర్ట్స్ కాలేజ్ అధ్యాపకుడు డాక్టర్ కె.నవీన్‌కుమార్, అనుబంధ కళాశాలల అధ్యాపకులు డాక్టర్ షేక్ సల్మాబేగం, డాక్టర్ కె.పుష్పలత, ఆర్.రేణుకశ్రీలు ఈ పుస్తక రచనలో భాగం పంచుకున్నారు. విశాఖపట్నానికి చెందిన శ్రీపబ్లిషింగ్ హౌస్ ఈ పుస్తకాన్ని ముద్రించింది. ఏపీపీఎస్సీ సభ్యులు ఏవీ రమణరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కెజియారాణి, డాక్టర్ వి.పెర్సిస్, ఆచార్య పి.సురేష్‌వర్మ, డాక్టర్ కీర్తిమరిటలు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించండి

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



మునికూడలి వద్ద రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాజమహేంద్రవరం– సీతానగరం రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి కాంట్రాక్టర్‌కు సూచించారు. మునికూడలిలో రోడ్డు పనులను బుధవారం అర్ధరాత్రి 11.30 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి కాటవరం వద్ద రోడ్డు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మిలు ఇక్కడ సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడుతూ నాణ్యతలో రాజీపడవద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు. సీతానగరం మండలం నుంచి నిత్యం ఎంతో మంది ప్రజలు వివిధ అవసరాలపై రాజమహేంద్రవరం వచ్చి వెళ్తుంటారని, గత టీడీపీ హయాంలో రోడ్డు పూర్తి అధ్వానంగా తయారైందన్నారు.వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారి విస్తరణ పనుల ఆవశ్యకత గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పనులు చేపడుతున్నామన్నారు. మండల ప్రజల ఆకాంక్ష మేరకు శాశ్వత పద్ధతిలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. రెండు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందించాలనే దృఢ సంకల్పంతో ఉన్నామన్నారు. ఆర్‌అండ్‌బి డీఈ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు

పార్కు పనులు పూర్తి చేయండి



ఏకేసీ కళాశాల వద్ద పార్కులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఏకేసీ కళాశాల సమీపంలో పార్కును సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆ పార్కును అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్క్‌లో వాకింగ్ ట్రాక్‌ను వెంటనే అందుబాటులో తేవాలన్నారు. అదనంగా చేపట్టిన ఫుడ్ కోర్టు, డయాస్, పాత్ వే, సెల్ఫీ పాయింట్ వంతెన వంటి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కంబాలచెరువు పార్కును సందర్శించి మిగిలిన పనులను పూర్తి చేయాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండు రంగారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అనుసంధాన రోడ్లను గుర్తించండి

తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి జాతీయ రహదారికి అనుసంధానిస్తూ నిర్మిస్తున్న 100 అడుగుల రహదారికి అనుసంధానమయ్యే అంతర్గత రోడ్లను గుర్తించి అభివృద్ధి చేయాలని అధికారులను కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆదేశించారు. మోరంపూడి రోడ్డు విస్తరణ, శ్రీవెంకటేశ్వర జనరల్ మార్కెట్, వంద అడుగుల రహదారిని అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. వెంకటేశ్వర జనరల్ మార్కెట్ నుంచి ఆవలో ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రం వరకూ ఉన్న పాత కాలువను పునరుద్ధరించి ఎప్పటికప్పుడు వాహనాలతో మురుగును తొలగించడానికి వీలుగా బండ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. షెల్టాన్ హోటల్ నుంచి ఆవవాంబే కాలనీ వరకూ కాలువ ఏర్పాటు చేయాలన్నారు. సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల సంరక్షణకు చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు: స్థానిక ప్రకాష్‌నగర్ సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అనాథ పిల్లల సంరక్షణ, విద్యా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ అనాథ పిల్లలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్ల బాధింపబడుతున్న పిల్లలు కనిపించినప్పుడు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, పోలీసులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలపాలన్నారు. పిల్లల పట్ల అమానుషంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పిల్లలతో భిక్షాటన చేయించడం, లైంగిక దాడులు చేయడం, వెట్టిచాకిరీ, బాల్య వివాహాలు వంటి సమస్యలను పూర్తి నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి కె.విజయకుమారి మాట్లాడుతూ పిల్లల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం సెంట్రల్ జైలులోని ప్రత్యేక మహిళా కారాగారాన్ని న్యాయమూర్తి ప్రత్యూష కుమారి సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించిన అనంతరం ఖైదీలతో మాట్లాడారు.

ఆత్మీయతానుబంధాలను చాటిన రాఖీ



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు



పందలపాకలో సోదరులకు రాఖీ కడుతున్న యువతి

అనపర్తి/బిక్కవోలు: సోదర, సోదరీమణుల ఆత్మీయత, అనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండగను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. తమ సోదరులు కలకాలం సుఖ సంతోషాలతో క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టగా జీవితాంతం వారికి తోడునీడగా నిలుస్తామని సోదరులు వాగ్దానం చేస్తూ వారికి బహుమతులు అందజేశారు. కుల మతాలకు అతీతంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో రక్షా బంధన్ పండగను జరుపుకున్నారు. రక్షా బంధన్ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సృష్టిలో భగవంతుడు అందించిన అపూర్వ బంధమే అన్నా చెల్లెళ్ల బంధమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఎంపీటీసీ అంసూరి పద్మావతి, పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు విజయకుమారి, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో గురువారం రక్షా బంధన్ పండుగను వైభవంగా జరుపుకొన్నారు. అన్నకు చెల్లి, తమ్ముడికి అక్క రాఖీ కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు. ఇదిలా ఉండగా కోరుకొండ షిర్డీసాయి స్కూల్‌లో ప్రిన్సిపాల్ గరగ లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో రాఖీలు వేడుకలు జరిగాయి. అలాగే మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు అక్కాచెల్లెమ్మలు రాఖీలు కట్టారు.

కొనసాగుతున్న గురుచరిత్ర పారాయణ



సాయిబాబా సన్నిధిలో గురుచరిత్రను పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో చేస్తున్న గురుచరిత్ర పారాయణ గురువారంతో తొమ్మిదో వారానికి చేరుకుంది. స్థానిక సాయిభక్త మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న పారాయణలో స్థానికులే కాకుండా పరిసర గ్రామాల భక్తులు కూడా పాల్గొంటున్నారు. వేకువజామున కాకడ హారతి అనంతరం ప్రారంభమై మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరుగుతుంది. 11 గురువారాలు గురు చరిత్రను పారాయణ చేసి, 12వ వారం (సెప్టెంబర్ 21) సాయి సచ్చరిత్రను పారాయణ చేస్తారు. అన్ని వారాలూ పారాయణలో పాల్గొన్న భక్తులకు ఆఖరి రోజున సాయి సచ్చరిత్ర పుస్తకాలను బహుమతిగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



రాజానగరంలో పోలింగ్ కేంద్రం వివరాలను పరిశీలిస్తున్న డీఆర్వో నరసింహులు

రాజానగరం: కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాలు అనుసరించి ఓటర్ల జాబితా రూపకల్పన సహేతుకంగా జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. గురువారం రాజానగరం గ్రామంలోని 188, 195 పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఇంటింటా సర్వే ద్వారా బీఎల్‌ఓలు సేకరించిన డేటా ఎంట్రీ పనులు కూడా సమాంతరంగా చేపడుతున్నామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,559 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో ఉపయోగించే ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాడ్ల పనితీరును, ధ్రువీకరించేందుకు సాంకేతిక నిపుణుల బృందం రానుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే వీటి పరిశీలన జరుగుతుందన్నారు.

హరే రామ హరే కృష్ణ



ఇస్కాన్‌లో జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు మహాభిషేకం చేస్తున్న పూజారులు

సీటీఆర్ఐ: స్థానిక ఇస్కాన్ మందిరంలో బలరామ జయంతి సందర్భంగా గురువారం జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు మహాభిషేకం నిర్వహించారు. సాయంత్రం హోమం జరిగింది. కమిటీ చైర్మన్ శ్రీశ్యామంగా నిమయదాసు, కమిటీ సభ్యులు శివానంద నిమయదాసు, హేమ నిమయదాసు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఉదయం బలరామ జయంతిని నిర్వహించారు. మందిరంలో శ్రీత్రిదండి స్వామి భక్తి కంకణ బన మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తిశ్రద్ధలతో గోపూజ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం నుంచి రోజూ రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు శ్రీభాగవతాచార్యులు, శ్రీపాద సురేష్ బ్రహ్మచారిచే శ్రీమద్ భాగవత ఉపన్యాసం జరుగుతుందని ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. రోజూ ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో గోశాల ట్రస్టు చైర్మన్, గోకుల్ టీవీఎస్ షోరూం అధినేత ఎన్‌వీఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణస్వామి వ్రతాలు

సీటీఆర్ఐ: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని స్థానిక సరస్వతి ఘాట్‌లో సత్యనారాయణ స్వామివారి వ్రతాలు ఉచితంగా నిర్వహించడం ఆనందదాయకమని జిల్లా ధార్మిక కమిటీ సభ్యుడు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోట సుబ్బారావు అన్నారు. గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, జిల్లా ధార్మిక కమిటీ అధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా భక్తులు స్వామివారి వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా పర్వదినాల్లో సరస్వతి ఘాట్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సత్యనారాయణ స్వామివారి ఆశీస్సులు అందరికీ ఉండాలని, ఈ వేడుకలలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. టీటీడీ జిల్లా ధార్మిక కమిటీ సభ్యుడు కాలెపు సతీష్, టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఓరుగంటి నరసింహ యోగి తదితరులు పాల్గొన్నారు.

గాడాలలో అన్నసమారాధన

మధురపూడి: గాడాల గ్రామంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో పూజలు కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనలో స్థానికులతో పాటు, మధురపూడి, నిడిగట్ల, కోలమూరు, రాయుడుపాకలు, పాలచర్ల తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

'విఖనస' ముని జయంతి



ప్రత్యేక అలంకరణలో విఖనస ముని

పెదపూడి: మండలంలోని సంపరలో వైఖానస ఆగమ సృష్టికర్త విఖనస ముని జయంతి గురువారం ఘనంగా జరిగింది. పండితులు ఖండవల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృత స్థాపన, తులసిపూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతాచార్యులు మాట్లాడుతూ తిరుపతిలో రోజూ జరిగే పూజా కార్యక్రమాలన్నీ వైఖానస ఆగమం ప్రకారమే జరుగుతాయన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన

గోకవరం: యర్రంపాలెంలో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను గురువారం మండల సచివాలయాల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు పాటి రాంబాబు పరిశీలించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో కర్రి సురారెడ్డి, చింతల అనిల్, ఎంపీటీసీ అసిరమ్మ, ఏసురత్నం పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సత్కారం



సీతానగరంలో శర్మ, రేణుకా దేవి దంపతులను సన్మానించిన అధ్యాపకులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ పెదసనగంటి వీరవెంకట సత్యనారాయణ శర్మ ఉద్యోగ విరమణను పురస్కరించుకుని అభినందన సత్కారం జరిగింది. ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు, సహచరులు ఆయన్ని సత్కరించారు. ఈ కళాశాలలో 1991 నుంచి ఒకేషనల్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శర్మ సేవలను వారు కొనియాడారు. అనంతరం సత్యనారాయణ శర్మ, రేణుకాదేవి దంపతులను సత్కరించారు. అధ్యాపకులు దొండమూడి కోటేశ్వరరావు, కేఎస్ఎల్‌వీ నరసింహ, శ్రీనివాస్, సురేష్‌బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మధురపూడి: కోరుకొండ మండలంలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీనివాసవర్మ గురువారం తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదన్నారు. గాడాల, బూరుగుపూడి, మధురపూడి, నిడిగట్ల, బుచ్చెంపేట తదితర గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వాహనాలకు వేలం

రంగంపేట: మండల పరిధిలో సారా అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్న రెండు ద్విచక్రవాహనాలను గురువారం స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో వేలం నిర్వహించినట్లు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. వేలం పాటలో రెండు ద్విచక్రవాహనాలకు అప్‌సెట్ ధర రూ.4 వేలుగా నిర్ణయించగా 462.5 శాతం హెచ్చు ధర పలికి రూ.22,500కు పాడుకున్నారన్నారు.

రాగి తీగ చోరీపై కేసు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కేపీఆర్ వెనక ఉన్న పామాయిల్ తోటలో జరిగిన రాగి తీగ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. బిక్కవోలు కేపీఆర్ వెనక తనకున్న పామాయిల్ తోటలో ఈ నెల 27న 194 మీటర్ల రాగి తీగను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని అనపర్తి మండలం పొలమూరు గ్రామానికి చెందిన సత్తి లక్ష్మణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేశామని ఎస్ఐ చెప్పారు.

ఇద్దరి అరెస్టు

గోకవరం: సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోరుకొండ ఎస్ఈబీ ఎస్సై సత్యనారాయణ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అక్రమంగా సారా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రంపయర్రంపాలెం గ్రామ శివారులో పోలీసులు మాటు వేశారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న గంట శివకృష్ణ, నూకబోయిన మణికంఠ స్వామిని తనిఖీ చేయగా వారి వద్ద 15 లీటర్లు సారా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

సారా కేసులో వ్యక్తికి రిమాండ్

రంగంపేట: మండలంలోని చిన్న దొడ్డిగుంటలో సారా బట్టీ నిర్వహిస్తున్న పెంకే శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి పెద్దాపురం కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి గురువారం తెలిపారు. అతడి నుంచి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

టీడీపీ ప్రచారం

సీతానగరం: మిర్తిపాడులో టీడీపీ మహాశక్తి కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు.